క్లుప్తంగా

పాస్టర్ మృతిపై విచారణ జరిపించాలి

రాజమహేంద్రవరం సిటీ: క్రైస్తవ మత ప్రచారకులు పాస్టర్ ప్రవీణ్ పగడాల మృతిపై సమగ్ర విచారణ జరిపించాలని మహిళా కాంగ్రెస్ తూర్పు గోదావరి జిల్లా అధ్యక్షురాలు మోత శారద బుధవారం విజ్ఞప్తి చేశారు. హైదరాబాద్‌కు చెందిన ప్రవీణ్ రోడ్డు ప్రమాదంలో దుర్మరణం చెందారన్న దానిపై అనుమానాలు వ్యక్తమవుతున్న నేపథ్యంలో ఘటనను అనుమానాస్పద మృతిగా నమోదు చేశారని, కనుక ఘటనపై సమగ్ర దర్యాప్తు చేయాలని కోరారు.

నగరంలో విద్యుత్‌కు నేడు అంతరాయం

రాజమహేంద్రవరం సిటీ: అత్యవసర విద్యుత్ మరమ్మతుల కారణంగా గురువారం నగరంలో పలు ప్రాంతాల్లో ఉదయం 7 గంటల నుంచి 10 గంటల వరకు, మధ్యాహ్నం 2 గంటల నుంచి 5 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనుందని ఏపీఈపీడీసీఎల్ ఈఈ నక్కపల్లి శ్యామ్యూల్ బుధవారం ప్రకటించారు. దీని ప్రభావంతో అన్నపూర్ణం పేట, మదన్‌సింగ్ పేట, జాంపేట, బోసు బొమ్మ సెంటర్, నందం గనిరాజు జంక్షన్, బైపాస్ రోడ్ ప్రాంతం, గాంధీబొమ్మ సెంటర్, తుమ్మలోవ, శేషయ్యమెట్ట, గోదావరి గట్టు, కోర్టు ప్రాంతం, సాయి హాస్పిటల్ పరిసర ప్రాంతాలలో ప్రభావం ఉంటుందన్నారు.

చేతి వృత్తులకు ప్రోత్సాహం

కడియం: చేతి వృత్తులకు తమ కూటమి ప్రభుత్వం ప్రోత్సాహాన్నిస్తుందని రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి తెలిపారు. ఆదరణ 3 పథకం అవగాహన కార్యక్రమం ఎంపీపీ వెలుగుబంటి సత్యప్రసాద్ అధ్యక్షతన స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన గోరంట్ల మాట్లాడారు. సమావేశంలో ఎంపీడీవో రమేష్, ఉపాధ్యక్షులు పంతం గణపతి, కలిదిండి విశాలాక్ష్మి, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

నర్సరీ రైతుల కళాత్మక దృష్టి అద్భుతం


పల్ల వెంకన్న నర్సరీని సందర్శించిన సూపరింటెండెంట్ రాహుల్

కడియం: నర్సరీ సాగు అనేది పర్యావరణానికి మేలు చేసేదే కాకుండా రైతుల కళాత్మక దృష్టితో చేసేదని రాజమహేంద్రవరం సెంట్రల్ జైలు సూపరింటెండెంట్ ఎస్.రాహుల్ అన్నారు. బుధవారం స్థానిక పల్ల వెంకన్న నర్సరీని ఆయన సందర్శించారు. నర్సరీ అధినేత పల్ల సుబ్రహ్మణ్యం ఆయనకు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా సూపరింటెండెంట్ మాట్లాడుతూ ఖైదీల సహకారంతో మొక్కలను పెంచుతున్నామన్నారు. దీనికి నర్సరీ రైతుల తోడ్పాటు అవసరమన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ సూపరింటెండెంట్ యం. రాజ్‌కుమార్, పర్యావరణ మిత్ర అవార్డు గ్రహీత చిలుకూరి శ్రీనివాసరావు తదితరులు ఉన్నారు.

ఆప్కో చేనేత వస్త్రాలపై ప్రత్యేక ఆఫర్లు

రాజమహేంద్రవరం రూరల్: ఉగాది, రంజాన్ పండుగలను పురస్కరించుకొని ప్రభుత్వం ఆదేశానుసారం సరికొత్త వస్త్రాలపై 30% డిస్కౌంట్, ఎంపిక చేసిన చేనేత వస్త్రాలపై 45% డిస్కౌంట్‌ను ఇస్తున్నట్లు ఆప్కో రాజమండ్రి మండల వాణిజ్య అధికారి బి.హరి ప్రసాదరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. తూర్పుగోదావరి జిల్లాలోని అన్ని ఆప్కో విక్రయ శాలలైన లాలాచెరువు, జెండాపంజా రోడ్డు, కోటగుమ్మం, గోకవరం బస్టాండ్ శివజ్యోతి థియేటర్ వద్ద రాజమండ్రి పట్టణాలలోని ఆప్కో విక్రయ శాలల్లో ఆఫర్లు అందించనున్నట్టు ఆయన తెలిపారు. జిల్లా ప్రజలందరూ ఆప్కో విక్రయ శాలలు సందర్శించి తమకు కావలసిన రాజమండ్రి, బందరు, వెంకటగిరి, మాధవరం, చీరాల, ఉప్పాడ చీరలు, షర్టింగ్, దోవతులు, దుప్పట్లు, లుంగీలు, టవల్స్ మొదలగు చేనేత వస్త్రాలు కొనుగోలు చేసి ప్రోత్సహించాలని కోరారు.

సీపీఐ ఇంటింటా సర్వే

ప్రకాశం నగర్: ఇళ్ల స్థలం ఉందా, నిరుద్యోగులు ఉన్నారా లేదా ఏమైనా సమస్యలు ఉన్నాయా వంటి అంశాలపై భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) ఆధ్వర్యంలో ఇంటింటా సర్వే ఈనెల 28 నుంచి చేపడుతున్నామని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి తాటిపాక మధు తెలిపారు. బుధవారం స్థానిక సీపీఐ కార్యాలయంలో పార్టీ విస్తృత స్థాయి సమావేశంల జిల్లా సహాయ కార్యదర్శి కుండ్రపు రాంబాబు అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి మధు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపల్ కమిషనర్ ఆస్తిపన్ను వడ్డీపై 50 శాతం రాయితీ ఇస్తానని ప్రకటన ఇచ్చారని, దానిని 100 శాతం రాయితీ ఇస్తేనే పేద మధ్య తరగతి వర్గాలు సంతోషంగా ఉంటాయని తెలిపారు బకాయిల చెల్లింపునకు రెండు మాసాలు సమయం ఇవ్వాలని ఆయన కోరారు. పాస్టర్ పగడాల ప్రవీణ్ అనుమానస్పద మృతిపై సీబీ సీఐడీ సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. ఎన్నికల ముందు మాజీ ఎంపీ భరత్ నాయకత్వంలో పదివేల మంది పైగా ఇళ్ల పట్టాలు ఇచ్చారని వారందరికీ కూటమి ప్రభుత్వం స్థలం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నగర కార్యదర్శి వి.కొండలరావు, ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి చింతలపూడి సునీల్, జిల్లా ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి పి.త్రిమూర్తులు పాల్గొన్నారు.

ఆవన్నీ తీరని కష్టాలు

- ఏటా ముంపుబారిన పడుతున్న ఆవ భూముల పంటలు
- నాలుగు వేల ఎకరాల్లో వరిసాగు
- వర్షాకాలమొస్తే రైతుల గుండెల్లో గుబులే
- ప్రతిపాదిత పనులకు అతీగతీ లేదంటున్న అన్నదాతలు

కడియం: ఆవలో ఏటా పంటలు ముంపుబారిన పడుతున్నాయి. రైతుల కష్టమంతా నీటి పాలవుతోంది. కడియం, వేమగిరి, ధవళేశ్వరం, హుకుంపేట, రాజవోలు, కేసవరం, కొండగుంటూరు, గ్రామాల మధ్యలో దాదాపు 2,500 ఎకరాల్లో విస్తరించి ఉన్న సారవంతమైన పంట భూమినే కడియం ఆవగా పిలుస్తారు. ఇక్కడ ఉన్న విస్తీర్ణం మొత్తం వరినే రైతులు సాగు చేస్తారు. ప్రధానంగా సాగునీటి కాలువల ద్వారానే పంటకు నీరందుతుంది. ఇందు కోసం నలువైపులా సాగునీరందేలా నాలుగు కాలువలను కూడా నిర్మించారు. ఈ కాలువల ద్వారా అవసరమైనప్పుడు సాగునీరు అందించడం, వర్షాకాలంలో ముంపునీరు బైటకు పారే విధంగా వీటిని రూపొందించారు. అయితే కాలానుగుణంగా సాగు, ముంపునీటి వ్యవస్థలు తీవ్ర నిర్లక్ష్యానికి గురయ్యాయి. దీంతో శివారు భూములకు సక్రమంగా సాగునీరు అందడం లేదు. ఒక వేళ వర్షాకాలంలో ముంపు ఏర్పడితే ఆవలోని ముంపునీరు దిగువకు కూడా పారడం లేదు. దీంతో ఏటా రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. ఇక్కడి సాగు–మురుగునీటి వ్యవస్థలను మెరుగు పరచాల్సిందిగా ఆవను సందర్శించేందుకు వచ్చే ప్రతి అధికారికి, ప్రజాప్రతినిధికి ఇక్కడి రైతులు మొర పెట్టుకుటూనే ఉన్నారు. అయినప్పటికీ ఫలితం మాత్రం లేదు. పూడికతీత పనులు, ఇతర మరమ్మతులంటూ పనులు చేసినప్పటికీ అవన్నీ తాత్కాలిక ప్రయోజనంగానే మిగిలిపోయాయి. ఆవకు శాశ్వతంగా ముంపునీటి సమస్యను పరిష్కరించేందుకు మాత్రం తగు చర్యలు ఇప్పటి వరకు చేపట్టనే లేదని రైతులు చెబుతున్నారు. ఏళ్ళ తరబడి జరుగుతున్న ఈ నిర్లక్ష్యాన్ని ఇప్పటికైనా వీడి, ఆవ రైతులు ఆరుగాలం శ్రమించి పండించిన పంటను వారికి దక్కేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

అధికారులకు మొరపెట్టుకున్నా..

ఇటీవల నీటిసంఘం అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన చిక్కాల ఈశ్వరరావు ఈ మేరకు ఆవ రైతుల ఇబ్బందులను విలేకరుల ముందు ఏకరువు పెట్టారు. ఆవ పొలాలకు సాగునీరు అందించడంతో పాటు, ముంపునీటిని దిగువ ప్రాంతాలకు తరలించే కాలువలపై చెక్‌డ్యామ్‌లు నిర్మించాలని సంబంధిత ఇరిగేషన్ అధికారులకు మొరపెట్టుకుంటున్నప్పటికీ ప్రయోజనం ఉండడం లేదన్నారు. ప్రస్తుత వేసవిలో పనులు ప్రారంభిస్తేనే, మున్ముందు వర్షాకాలం నాటికి చెక్‌డ్యామ్‌లు అందుబాటులోకి వచ్చి, పంట నష్టం సంభవించకుండా ఉంటుందని వివరించినప్పటికీ అధికార యంత్రాంగానికి చలనం రావడం లేదన్నారు.


నీటి సంఘం అధ్యక్షులు చిక్కాల ఈశ్వరరావు

ప్రతి వర్షాకాలం సీజన్‌లోనూ ఆవ ప్రాంత రైతులు ముంపు కారణంగా పంట నష్టపోతూనే ఉంటున్నారన్నారు. అయినప్పటికీ రైతుల బాధలను పట్టించుకోకపోవడం దారుణమన్నారు. కడియం ఫిష్‌ఫామ్ నుంచి రాజవోలు వరకు క్వారీ కాలువ ఉంటుందన్నారు. అలాగే ఫిష్‌ఫామ్ సమీపంలోని తూము దగ్గర నుంచి నడిబోది ద్వారా కూడా ఆవలో సాగునీరు వస్తుందన్నారు. కడియం లాకులు దగ్గర నుంచి ప్రారంభమై ఆవలోకి కర్ర కాలువ (ఎర్రకాలువ) ద్వారా సాగునీరు ప్రవహిస్తుంది. ఇది కాకుండా ఆవ ఎగువ ప్రాంతం నుంచి మొదలై జేగురుపాడు గ్రామం సమీపంలోని ఆడదాని రేవు దాటిన తరువాత తుల్యాభాగలో కలిసే మురుగు కాలువ ద్వారా ముంపునీరు బైటకు వెళుతుంది. వీటిలో క్వారీ కాలువపై రెండు, కర్ర కాలువపై ఒకటి, మురుగు కాలువపై ఒక చెక్ డ్యామ్‌ను నిర్మించాలని రైతుల తరపున కోరుతున్నామని ఈశ్వరరావు వివరించారు. ఈ చెక్‌డ్యామ్‌ల ద్వారా ఎగువ ప్రాంతాల నుంచి వచ్చిపడే ముంపునీరు ఆవ మొత్తానికి విస్తరించకుండా నేరుగా మురుగుకాలువలోకి మళ్లుతుందన్నారు. తద్వారా రైతుల పంటకు రక్షణ కలుగుతుందన్నారు. ఇందుకోసం సుమారు రెండు కోట్ల రూపాయల వరకు ఖర్చవుతుందని ప్రాథమికంగా అధికారులు అంచనా వేస్తున్నారన్నారు. అయితే ఈ ప్రతిపాదనలు తక్షణం అమల్లోకి రాకపోతే ఈ యేడాది కూడా తమకు ముంపు కష్టం తప్పదేమోనని ఆవ రైతులు ఆదోళనలో ఉన్నారు. ఈ మేరకు ప్రజాప్రతినిధులు, అధికారులు దృష్టిపెట్టి ఆవ రైతులు ఆరుగాలం శ్రమించి పండిస్తున్న పంటను కాపాడేందుకు చర్యలు తీసుకోవాలని ఈశ్వరరావు విజ్ఞప్తి చేశారు.


కడియం ఆవకు సాగునీటిని అందించడంలో కీలకమైన లాకులు


ఆవకు నీరందించే కాలువ పూడికతో నిండిపోయిన దృశ్యం


పూడికతీతతో ముందుకు సాగని సాగు, మురుగునీరు

రాత్రిపూట తిరిగే ఆటో కార్మికులకు పోలీస్ గుర్తింపు కార్డులు

ఐఎన్టీయూసీ జిల్లా అధ్యక్షుడు వాసంశెట్టి గంగాధర్

రాజమహేంద్రవరం సిటీ: రాత్రి సమయాల్లో తిరిగే ఆటో డ్రైవర్లకు గుర్తింపు కార్డులు ఇప్పిస్తామని జిల్లా ఐఎన్టీయూసీ అధ్యక్షుడు వాసంశెట్టి గంగాధర్ హామీ ఇచ్చారు. బుధవారం కంబాలచెరువు ఎంఎస్ఆర్ హైటెక్ బస్టాండ్ ఆటో డ్రైవర్స్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐఎన్టీయూసీకి పార్టీలకు సంబంధం లేదని, ఏ పార్టీలో ఉన్నా ఐఎన్టీయూసీలో ఉండవచ్చని జాతీయ అధ్యక్షుడు సంజీవరెడ్డి చెప్పారన్నారు. ఇటీవలే కాంగ్రెస్‌లో ఉన్న జె.టి.రామారావు అనే వ్యక్తి అతనే ఐఎన్టీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు అని తూర్పు గోదావరి జిల్లా అధ్యక్షుడిగా కూడా తానేనని చెప్పుకుంటున్నారని అయితే ఎవరు నియమించారని మీడియా ప్రతినిధులు అడిగితే పొంతనలేని సమాధానాలు చెప్పారని వాసంశెట్టి ఎద్దేవా చేశారు. కార్మికులు ఎవరూ ఎటువంటి అపోహలు పెట్టుకోవద్దని, వారి సంక్షేమం కోసం ఐఎన్టీయూసీ కృషి చేస్తుందన్నారు. పుష్కరాల సమయంలో బయటి నుంచి వచ్చే ఆటో డ్రైవర్లు, నగరంలో ఉండే ఆటో డ్రైవర్లు ఎవరనేది యూనియన్ ద్వారానే పోలీసులు గుర్తించి గుర్తింపు కార్డులు అందచేయిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఐఎన్టీయూసీ ఉభయ రాష్ట్రాల జనరల్ సెక్రటరీ నారాయణరావు,టి.లక్ష్మి నరసింహారావు, గూడూరి సుధాకర్, కుమరపు దాసు, బళ్ళ శ్రీరామమూర్తి,తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో పాల్గొన్న వాసంశెట్టి గంగాధర్

పంచాయతీ డెవలప్‌మెంట్ ప్లాన్ వెంటనే పూర్తి చేయాలి

కడియం: డివిజన్‌లోని అన్ని గ్రామ పంచాయతీలు 25–26 సంవత్సరానికి సంబంధించి గ్రామ పంచాయతీ డెవలప్‌మెంట్ ప్లాన్ (జీపీడీపీ) వెంటనే పూర్తి చేయాలని డివిజనల్ పంచాయతీ అధికారి ఎం.నాగలత ఆదేశించారు. రాబోయ సంవత్సరానికి ఏఏ అభివృద్ధి పనులు చేపట్టాలి, ఏ పనులకు ఎన్ని నిధులు కేటాయించి వంటి వన్నీ ఆన్‌లైన్ ద్వారా పూర్తి చేసి వెంటనే ప్రభుత్వానికి నివేదిక ఇవ్వాలన్నారు. ఈ మేరకు వేమగిరి పంచాయతీలో జీపీడీపీ తయారీ విధానాన్ని బుధవారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా నాగలత మాట్లాడుతూ 24–25 ఆర్థిక సంవత్సరం ముగుస్తున్నందున తక్షణమే అన్ని పంచాయతీలు ఈ ప్లాన్‌ను పూర్తి చేయాలన్నారు. ప్లాన్ అనుమతి పొందిన తరువాతనే గ్రామంలో అభివృద్ధి పనులు చేపట్టాలన్నారు. పంచాయతీ కార్యదర్శి రూప్‌చంద్, సచివాలయ కార్యదర్శి పాపారాయుడు తదితరులు పాల్గొన్నారు.


వేమగిరిలో జీపీడీపీని పరిశీలిస్తున్న డీపీవో నాగలత

మార్కెట్‌లోకి ఎఫ్‌జెడ్ఎస్ ఫై హైబ్రిడ్ మోటార్ సైకిల్

రాజమహేంద్రవరం రూరల్: రాజమహేంద్రవరం సిరిమోటార్స్ యమహా షోరూమ్‌లో బుధవారం 150సీ రంగంలోనే మొట్టమొదటి యమహా ఎఫ్‌జెడ్ఎస్ ఫై హైబ్రిడ్ మోటార్‌సైకిల్‌ను రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి మార్కెట్‌లోకి విడుదల చేశారు. టీడీపీనాయకులు వాసిరెడ్డి బాబి, సిరిమోటర్స్ ఎండీ వీధిరాంప్రసాద్,యమహాకంపెనీ ఏరియా సేల్స్‌మేనేజర్ అన్వర్‌బేగ్, ఏరియా సర్వీస్ మేనేజర్ భరత్, యమహా షోరూమ్ స్టాఫ్, కస్టమర్ల సమక్షంలో ఎఫ్‌జెడ్ఎస్ ఫై హైబ్రిడ్ మోటార్‌సైకిల్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా సిరిమోటార్స్ ఎండీ వీధిరాంప్రసాద్ మాట్లాడుతూ ఈ మోటార్‌సైకిల్ హైబ్రిడ్ టెక్నాలజీ, స్టార్ట్ అండ్ స్టాప్ సిస్టమ్, ఎస్ఎంజీ(స్మార్ట్‌మోటర్‌జనరేటర్), నావిగేషన్ మ్యాప్స్ ఫీచర్స్‌తో సరికొత్త యమహా ఎఫ్‌జెడ్ఎస్‌పై హైబ్రిడ్ గ్రాండ్ ఓపెనింగ్ చేశారు. ఈ వాహన బుకింగ్స్ ప్రారంభం చేస్తూ రాజమహేంద్రవరం నగరంలో విశిష్ట సేవలకు ప్రీమియం ఎక్స్‌పీరియన్స్ తమ బ్లూస్క్వేర్ షోరూమ్‌ని సందర్శించాలని ఆయన తెలిపారు.


ఎఫ్‌జెడ్ఎస్ ఫై హైబ్రిడ్ మోటార్‌సైకిల్ మార్కెట్‌లోకి విడుదల చేస్తున్న రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి

లీగల్‌సెల్ ఉపాధ్యక్షుడిగా మూర్తి

కడియం: జాతీయ బీసీ సంఘం లీగల్ సెల్ ఉపాధ్యక్షుడిగా తనను నియమిస్తూ జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య నుంచి తనకు ఉత్తర్వులు అందాయని దండుబోయిన వీరవెంకటసత్యనారాయణ మూర్తి (గోకుల్ నర్సరీ మూర్తి) తెలిపారు. సదరు ఉత్తర్వులను తమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వై.నాగేశ్వరరావు, రాష్ట్ర ఇన్‌చార్జి వై.నూకాలమ్మల చేతుల మీదుగా అందజేశారన్నారు. సంఘం లక్ష్యాల మేరకు పనిచేస్తానని మూర్తి తెలిపారు.

ఎస్సీ యువతకు ఉచిత శిక్షణ

రాజమహేంద్రవరం రూరల్: ఎస్సీ యువతీ యువకులకు పీఎంఏజేవై పథకం ద్వారా ఏపీఎస్ఎస్‌డీసీ, ఎస్సీకార్పొరేషన్ ఆధ్వర్యంలో వివిధ కోర్సుల్లో ఉచిత శిక్షణను బొమ్మూరులోని నేక్‌లో ఇవ్వనున్నట్టు నేషనల్ అకాడమీ ఆఫ్ కనస్ట్రక్షన్స్ డిప్యూటీ డైరెక్టర్, నోడల్ ఆఫీసర్ పి.మురళీధర్ అన్నారు. బుధవారం నేక్‌లో ఆయన అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మురళీధర్ మాట్లాడుతూ గురువారం ఉదయం నాక్ బొమ్మూరు అధికారులతో జరిపిన సమావేశంలో ఎస్సీ యువతీ యువకులకు జూనియర్ సాఫ్ట్వేర్ డెవలపర్, డొమెస్టిక్ ఐ.టీ హెల్ప్ డెస్క్ అసిస్టెంట్, సెల్ఫ్ ఎంప్లాయిడ్ టైలర్, అసిస్టెంట్ హెయిర్ స్టైలిస్ట్ కోర్సుల్లో బొమ్మూరు నేక్‌లో త్వరలో శిక్షణ ఇస్తున్నట్టు తెలిపారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు 18 నుంచి 45 ఏళ్ల లోపు ఉండి పదో తరగతి సర్టిఫికెట్, ఆధార్ కార్డు, కుల ధ్రువీకరణ పత్రం, 4 పాస్ పోర్ట్ సైజ్ ఫొటోలు, వారి పేరుపై ఉన్న బ్యాంకు పాస్ బుక్ మొదటి పేజీల జిరాక్స్ కాపీలతో నేక్‌లో సంప్రదించి పేరు నమోదు చేయించుకోవాలన్నారు. ఇతర వివరాలు అసిస్టెంటు డైరెక్టర్ జే.రాజు 98664 43303 నంబరును సంప్రదించాలన్నారు. ఈ ఉచిత శిక్షణలో మధ్యాహ్న భోజనం, రెండు పర్యాయాలు స్నాక్స్ ఇస్తూ శిక్షణానంతరము ప్రసిద్ధ కంపెనీలలో ఉద్యోగ కల్పనతోబాటు కేంద్ర ప్రభుత్వ సర్టిఫికెట్ ప్రదానం చేస్తున్నారు. ఈసమావేశంలో అసిస్టెంట్ డైరెక్టర్ రాజు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఈ శ్రమ్ కార్డు నమోదు తప్పనిసరి

కడియం: నర్సరీ రైతు కూలీలందరూ ఈ శ్రమ్ కార్డులను తప్పని సరిగా నమోదు చేయించి, తీసుకోవాలని సర్ ఆర్థర్ కాటన్ నర్సరీ ఫార్మర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు రత్నం అయ్యప్ప అన్నారు. ఈ మేరకు బుధవారం అసోసియేషన్ కార్యాలయం వద్ద కార్మికులతో సమావేశం నిర్వహించారు. మొక్కల ఎగుమతులు, దిగుమతులు, ప్లాంటేషన్ కూలీలు, ఆటోలపై మొక్కలు రవాణా చేసే కార్మికులు, కూలీలు, మేస్త్రీలు అందరూ ఇందులో నమోదు చేయించుకోవచ్చునన్నారు. ఏదైనా ప్రమాదం భారిన పడి మరణించినా, శాశ్వత అంగవైకల్యం ఏర్పడినా రెండు లక్షల రూపాయలు సాయం అందుతుందన్నారు. పాక్షిక అంగవైకల్యం కలిగితే లక్ష రూపాయలు కేంద్ర ప్రభుత్వం ద్వారా అందుతాయన్నారు. మార్చి 31వ తేదీ వరకు నమోదు చేసుకోవచ్చునన్నారు. 30వ తేదీ వరకు అసోసియేషన్ కార్యాలయం వద్ద ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు నమోదు శిబిరం నిర్వహిస్తున్నామన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న అయ్యప్ప

ఘనంగా బైబిలు మిషన్ మహాసభలు

రాజమహేంద్రవరం రూరల్: రాజమండ్రి శానిటోరియం దగ్గర బైబిలు మిషను 58వ మహాసభలు బుధవారం రెండో రోజుకు చేరుకున్నాయి. బైబిలు మిషను ప్రెసిడెంట్ బిషప్ డాక్టర్ ఎస్.విజయరాజు ప్రారంభ ప్రార్థన చేసి మహాసభలను ప్రారంభించారు. కేథడ్రల్ సభ్యులు, గోల్డెన్ జూబిలీ మందిర విశ్వాసులు, స్వస్థత శాల సభ్యులు బైబిల్ మిషన్ తెలుగు క్రైస్తవ కీర్తనలు ఆలపించారు. డాక్టర్ ఎస్.విజయరాజు మాట్లాడుతూ ఏసుక్రీస్తు సిలువ శ్రమ కాలంలో క్రైస్తవులందరూ మహాసభలకు చేరి సిలువ ధ్యానంలో పాలు పంచుకోవాలని సూచించారు. ఏసుక్రీస్తు మార్గమే మోక్షానికి మార్గమని ఉపదేశించారు. రెవ.సుదర్శనరావు ప్రారంభించిన బైబిల్ మిషను మహాసభలు ప్రతి ఏడాది దేవుని మహిమ అర్థమే జరుగుతున్నాయని తెలియజేశారు. ఈ సందర్భంగా బైబిలు మిషను అధికారులు రెవ.డి.షాలేంరాజు, రెవ.పీజే సుధాకర్, రెవ.డి.సువర్ణ రాజు రెవ.డాక్టర్ ఎస్.సిమ్యోన్ సుదర్శన్ ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో రెవ.ఎస్.విలియం బెంటిక్, ఎస్.ఉషారాణి, పాస్టర్లు, సంఘ పెద్దలు పాల్గొన్నారు.


ప్రార్థన ఆశీర్వాదాలు అందిస్తున్న రెవ విజయరాజు

ఘనంగా ఇఫ్తార్ విందు

కడియం: రంజాన్ మాసం సందర్భంగా గ్రామంలో ఉన్న మస్జిద్,-ఏ- కౌసర్ మసీదులో ముస్లింలు బాధ్యతా సేవా సంస్థ ఆధ్వర్యంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి సంస్థ అధ్యక్షుడు గిరజాల బాబు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా గిరజాల బాబు మాట్లాడుతూ ముస్లింలు రంజాన్ మాసం శుభాకాంక్షలు తెలియజేస్తూ, అల్లా దయతో అందరూ సుఖశాంతులతో, సహోదర భావంతో మెలగాలన్నారు. వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు యాదల సతీష్ చంద్ర స్టాలిన్ మాట్లాడుతూ రంజాన్ మాసంలో ముస్లింలు బాధ్యత సేవా సంస్థ ద్వారా 21 ఏళ్లుగా ఇఫ్తార్ విందు ఇస్తున్న గిరజాల బాబు సేవలు అభినందనీయమన్నారు. కుల, మతాలకు అతీతంగా గిరజాల ఇఫ్తార్ విందు ఇవ్వడం ప్రశంసనీయమని పేర్కొన్నారు. అనంతరం కడియం మసీదు కు స్థలం కొనుగోలు చేయుటకు సుమారు 20 లక్షల రూపాయలు పైబడి నగదును అందజేసినందుకు, విపత్తులు వాటిలినప్పుడు పేద ప్రజలను తమదైన శైలిలో సేవాభావంతో సేవలందిస్తున్న డాక్టర్ అజిమతుల్లా బేగ్‌ను మెమెంటో శాలువాతో సత్కరించారు. ఆయన చేస్తున్న సేవలను గుర్తు చేసుకున్నారు. ముస్లిం పేద కుటుంబాలకు నిత్యావసర వస్తువులు చీరలు దుప్పట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో మసీద్ - ఏ-కౌసర్ అధ్యక్షులు షేక్ సలీం, సర్కార్ భాష, మాజీ జిల్లా వక్ఫ్ బోర్డ్ అధ్యక్షులు ఏం.డి ఆరిఫ్,షటర్ బాషా, ఇబ్రహీం బాషా, తిరుమల శెట్టి శ్రీనివాస్, కానబోయిన సాగర్, కొండపల్లి పట్టియ్య, దాసరి శేషగిరి, కొత్తపల్లి శివాజీ, సాపిరెడ్డి సూరిబాబు, ఆకుల సుధాకర్, బాధ్యతా సేవా సంస్థ సభ్యులు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ శ్రేణులు, అధిక సంఖ్యలో ముస్లింలు పాల్గొన్నారు.


అజిమతుల్లా బేగ్‌ను సత్కరిస్తున్న గిరజాల బాబు, యాదలస్టాలిన్ తదితరులు

లేపాక్షిలో కొనసాగుతున్న డిస్కౌంట్ సేల్స్

సీటీఆర్ఐ: హస్తకళలకు నిలయంగా మారిన లేపాక్షి ఎంపోరియం రాజమహేంద్రవరంలోని గోకవరం బస్టాండ వద్ద ఉంది. లేపాక్షి ఎంపోరియానికి నాలుగు దశాబ్దాలకు పైగా చరిత్ర ఉంది. 1982లో ఈ ఎంపోరియాన్ని నిర్మించారు. ఆంధ్రప్రదేశ్ హస్తకళ అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో దీన్ని ఏర్పాటు చేశారు. అప్పటి నుంచి వివిధ రకాల హస్తకళలు, చేనేత వస్త్రాల విక్రయాల్లో లేపాక్షి ఎంపోరియం ఒక అడ్రాస్‌గా మారిపోయింది. రాష్ట్రంలో వివిధ ప్రాంతాల్లో తయారైన వస్తువులను అన్ని ఇక్కడ ఒక్క చోటే చూడచ్చు. ఎంతో మంది కళాకారులు చాలా రోజులు శ్రమించి చేసిన వైట్‌వుడ్ బొమ్మలు, ఏటికొప్పాక బొమ్మలు, లెదర్ పప్పెట్, కళంకారి వస్తువులు, నీమ్ వుడ్ కళాఖండాలు, నటరాజ విగ్రహం వంటివి ఇక్కడ ఆకర్షణీయంగా ఉన్నాయి. నగర నుంచే కాకుండా విదేశీయులు రాజమహేంద్రవరానికి విచ్చేసినప్పుడు వారి ట్రిప్‌లో లేపాక్షి ఎంపోరియం కూడా తప్పనిసరిగా ఉంటుంది. మార్చి క్లియరెన్స్ సేల్ సందర్భంగా పది నుంచి 50 శాతం వరకు కొన్ని వస్తువులపై డిస్కౌంట్ కల్పించడంతో ప్రజలు విక్రయాలపై ఆసక్తి చూపుతున్నారు.


లేపాక్షిలో డిస్కౌంట్ సేల్స్ విక్రయిస్తున్న సిబ్బంది

లక్ష్మీగణపతి హుండీ లెక్కింపు

బిక్కవోలు: గ్రామంలో లక్ష్మీగణపతిస్వామి, గోలింగేశ్వరస్వామి దేవాలయాల్లో గల హుండీలను బుధవారం లెక్కించినట్టు ఆలయ కార్యనిర్వాహణ అధికారి రామలింగ భాస్కర్ తెలిపారు. దేవదాయ శాఖ రామచంద్రాపురం వారి పర్యవేక్షణలో, గ్రామ పెద్దలు, భక్తులు సమక్షంలో ఈ లెక్కింపు నిర్వహించామన్నారు. లక్ష్మీగణపతి హుండీ ద్వారా రూ.10,97,441, గోలింగేశ్వర స్వామి హుండీ ద్వారా రూ.3,93,859 వచ్చాయన్నారు. సుమారు మూడు నెలల ఇరవై రోజుల కాలానికి ఈ ఆదాయం వచ్చినట్టు తెలిపారు.

బాలికల రక్షణకే పోక్సో చట్టం

రాజానగరం: బాలికల సంరక్షణ కోసం పోక్సో చట్టం ఉందని, 18 సంవత్సరాలలోపు అమ్మాయిలపై ఎటువంటి దాడులు జరిగిన ఈ చట్ట ప్రకారం నిందితులపై కఠిన చర్యలు తీసుకునేందుకు అవకాశం ఉందని జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ కార్యదర్శి శ్రీలక్ష్మి అన్నారు. స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని అంగన్‌వాడీ కార్యకర్తలకు పోక్సో చట్టం (లైంగిక నేరాల నుంచి చిన్నారులకు రక్షణ కల్పించే భారతీయ చట్టం) పై బుధవారం అవగాహన కార్యక్రమం జరిగింది. చిన్న పిల్లలు చదువు పైనే దృష్టిని కేంద్రీకరించాలని, ఎటువంటి ఆకర్షణలకు, ప్రలోభాలకు లోను కావొద్దన్నారు. సమాజంలో మంచి, చెడులను గ్రహిస్తూ, మీరు ఎంచుకున్న లక్ష్యాన్ని చేరుకుని, ఉన్నత స్థాయిలో స్థిరపడేలా ప్రయత్నించాలని సూచించారు. ఏవిధమైన సమస్య వచ్చినా తల్లిదండ్రులకు చెప్పడంతోపాటు వాటిని మనోధైర్యంతో ఎదుర్కొనేందుకు సిద్ధం కావలన్నారు. తొమ్మిదేళ్ల నిండిన ఆడపిల్లలను అమ్మ దగ్గరనే ఉంచాలన్నారు. అంతేకాకుండా ఈ వయస్సు నుంచి తల్లిదండ్రులు నిరంతరం తమ పిల్లలను గమనిస్తూ ఉండాలని, ముఖ్యంగా మొబైల్ ఫోన్లలో వీడియోల చూడడంపై పరిశీలించాలన్నారు. స్త్రీ, శిశు సంక్షేమ శాఖ జిల్లా అధికారి పి.విజయకుమారి మాట్లాడుతూ ప్రతి ఆడపిల్ల గుడ్ టచ్, బేడ్ టచ్‌లపై అవగాహన కలిగి ఉండాలని, ఎవరికి వారే ఆత్మరక్షణతో మెలగాలని సూచించారు. కార్యక్రమంలో సీడీపీఓ టి.నాగమణి, అడ్వకేట్ జి.దేవిభవాని, సూపర్‌వైజర్లు ఎస్‌కే దుర్గామణి, ఎన్.భూదేవి, ఎస్.సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

పాస్టర్ ప్రవీణ్ మృతిపై సమగ్ర విచారణ జరపాలి

ఏఐసీసీ జాతీయ అధ్యక్షులు గెర హనోక్

రాజమహేంద్రవరం రూరల్: పాస్టర్ ప్రవీణ్ పగడాల అనుమానాస్పద మృతిపై సమగ్ర దర్యాప్తు జరపాలని అసోసియేషన్ ఆఫ్ ఇంటిగ్రేటెడ్ క్రిస్టియన్ కౌన్సిల్(ఏఐసీసీ) జాతీయ అధ్యక్షుడు గెర హనోక్ డిమాండ్ చేశారు. బుధవారం రాజమండ్రి ప్రభుత్వాసుపత్రి వద్ద క్రైస్తవ సంఘాలు నిరసన తెలిపాయి. ఈ నిరసనలో పాల్గొన్న గెర హనోక్ మాట్లాడుతూ పాస్టర్ ప్రవీణ్ మృతి చెందిన ప్రదేశాన్ని పరిశీలించామని, రోడ్డు ప్రమాదం జరిగినట్లు ఎటువంటి స్పష్టమైన సాంకేతాలు లేవన్నారు. పాస్టర్ ప్రవీణ్ ఆకస్మిక, అనుమానాస్పద మరణం యావత్ క్రైస్తవ లోకాన్ని దిగ్భ్రాంతికి, బాధకు గురిచేసిందన్నారు. ఆయన దేవునికి అంకితభావంతో కూడిన సేవకుడని కొనియాడారు. ముఖ్యంగా, పాస్టర్ పగడాల ఒక నెల క్రితం సోషల్ మీడియా పోస్ట్‌లో తన ప్రాణాలకు ముప్పు ఉందని భయాలను వ్యక్తం చేశారన్నారు. ఈ సంఘటన భారతదేశంలో అనేక ప్రాంతాల్లో ఉన్న క్రైస్తవుల భద్రతపై ఆందోళనలను రేకెత్తించిందన్నారు. నిష్పాక్షికంగా, త్వరితగతిన దర్యాప్తు జరపాలని అసోసియేషన్ ఆఫ్ ఇంటిగ్రేటెడ్ క్రిస్టియన్ కౌన్సిల్ పిలుపునిచ్చిందన్నారు. ఈ కార్యక్రమంలో గౌరవ అధ్యక్షుడు పాస్టర్ బెన్హమ్, పాస్టర్ జోన, సిటీ ప్రెసిడెంట్ ప్రభుదాస్, రాష్ట్ర కార్యదర్శి డానియల్ బోస్, పొలిటికల్ వింగ్ మద్దిరాల కమలాకర్ రావు, లీగల్ సెల్ బాబూరావు, సతీష్, నెహెమ్యా, అజయ్, డానియల్ బాబు, అబ్రహం, డేవిడ్ రాజు, పాల్ రాజ్, మనోహర్, ఏసుదాస్, సిస్టర్ గ్రేస్, ఏఐసీసీ టీం పాల్గొన్నారు.


ప్రభుత్వాసుపత్రి వద్ద నిరసనలో పాల్గొన్న ఏఐసీసీ జాతీయ అధ్యక్షులు గెర హనోక్

సినిమాలు



శ్యామల	:	ఎల్2ఎంపురాన్
సూర్యమినీ	:	దిల్‌రూబా,ఎవడే సుబ్రహ్మణ్యం
సూర్యప్యాలెస్	:	టక్‌టక్, ఎవడే సుబ్రహ్మణ్యం
స్వామి	:	కోర్ట్
శివజ్యోతి	:	ఎల్2ఎంపూరన్
అనుశ్రీ	:	వీరధీరశూర
ఊర్వశి	:	ఎల్2ఎంపూరన్
మేనక	:	ఆర్టిస్ట్,కిస్‌కిస్‌కిసిక్
రంభ	:	షణ్ముఖ
కుమారి	:	రిటర్న్ఆఫ్‌దిడ్రాగన్
అప్సర	:	నాయక్
అశోక	:	చావా
నామవరం		
వీఎస్.మహల్ ధవళేశ్వరం	:	ఎల్2ఎంపూరన్
మురళీకృష్ణ కడియం	:	ఎల్2ఎంపూరన్
వెంకటసూర్య	:	ఎల్2ఎంపూరన్